
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

శుక్రవారం 4 ఏప్రిల్ 2025



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

ఈత.. కారాదు.. గుండె కోత!

- సరదాగా ఈతకు వెళ్లి బాలబాలికల మృత్యువాత
- కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్న పెద్దలు
- ప్రతీ వేసవిలో జరుగుతున్న సంఘటనలు
- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

విద్యార్థులకు ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. త్వరలోనే సెలవులు కూడా ప్రకటించనున్నారు. వేసవిలో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నా.. పెద్ద తేడా లేకుండా ఈతకు వెళ్తుంటారు. విద్యార్థులు ఒకరికి ఒకరు కలిసి చెరువులు, కుంటలు, నదులు, బావుల వద్దకు ఈతకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఈత సరిగా రాకనో, ఇతర కారణాల వల్లనో కొందరు నీటిలో మునిగి మృత్యువాత పడుతున్నారు. వారిని కాపాడే క్రమంలో కొందరు పెద్దలు కూడా నీట మునిగి చనిపోయిన సంఘటనలున్నాయి. ఇటీవల రాజోళి మండలంలోని సుంకేసుల వద్ద తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ముగ్గురు మృతి చెందారు. వేసవిలో ఈతకు వెళ్లే విద్యార్థులను తమ తల్లిదండ్రులు వెంట తీసుకెళ్లాలే తప్ప ఒంటరిగా వదిలిపెట్టొద్దు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ఈత సరదా కుటుంబాల్లో విషాదం నింపుతుంది.

- అయిజ టౌన్, ఆంధ్రజ్యోతి

7

ముమ్మరంగా శిథిలాల తొలగింపు

- ఐదు యంత్రాలతో కన్వేయర్ బంకర్‌లోకి మట్టి, బురద తరలింపు
- ఒక్కరోజులో 15 మీటర్ల వరకు శిథిలాల తరలింపు



6

గతం కంటే కొంత మెరుగు

- లక్ష్యం చేరుకోలేకపోయినా గతేడాదితో పోలిస్తే కొంత మేలు
- వనపర్తి జిల్లాలోని మునిసిపాలిటీలలో 50 శాతం దాటిన ఆస్తి పన్ను వసూలు
- 89.25 శాతం వసూలుతో మొదటి స్థానంలో నిలిచిన పెబ్బేరు

6

ఆస్తిపన్ను వసూలులో వనపర్తి జిల్లా పూర్తిగా వెనుకబడి ఉన్నది. ఆర్థిక సంవత్సరం చివరి దశలో అధికారులు పన్ను వసూలులో వేగం పెంచారు. లక్ష్యం చేరుకోలేకపోయినా గతేడాది కంటే ఈ ఏడాది కొంచెం మెరుగైన ఫలితాలనే సాధించారు. జిల్లాలో వనపర్తి, ఆత్మకూర్, అమరచింత, కొత్తకోట, పెబ్బేరు మునిసిపాలిటీలు ఉన్నాయి. ఇందులో పెబ్బేరు మునిసిపాలిటీ 89.25 శాతం వసూలు చేసి మొదటి వరుసలో నిలిచింది. తరువాత స్థానాల్లో అమరచింత, కొత్తకోట, ఆత్మకూరు, వనపర్తి మునిసిపాలిటీలు నిలిచాయి.

- వనపర్తి టౌన్, ఆంధ్రజ్యోతి

బోధనా నైపుణ్యాల పెంపునకు శిక్షణ

- పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు నిర్వహణ

6

కొండారెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక శోభ

- వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

6

సాగునీరు బంద్



నీళ్లు లేక ఎండిపోయిన డీ6 కాలువ

- ఎగువ నుంచి నీరు విడుదలైతేనే పంటలు
- జూరాల ఎడమ కాలువ ద్వారా రెండు రోజులు మాత్రమే నీటి విడుదల
- పైరుకు మరో రెండు తడులు అవసరం అంటున్న రైతులు

ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకే వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీటి అవసరాలను తీరుస్తున్నది. కానీ ప్రస్తుతం జూరాలలో నీరు తగ్గడంతో పంటలకు పూర్తిస్థాయిలో నీరందించలేకపోతున్నారు. ప్రతీ ఏడాది యాసంగిలో చివరి ఆయకట్టు వరకు ఎడమ కాలువ ద్వారా లక్ష ఎకరాలకు.. కుడికాలువ ద్వారా 35 వేల ఎకరాలకు సాగునీటిని అందించేవారు. అలాగే యాసంగి సీజన్‌లో వారబందీ పద్ధతిలో సాగుకు నీటి విడుదల చేసేవారు. అదే విధంగా ఈ ఏడాది కూడా ఎడమ కాలువ ద్వారా 20 వేల ఎకరాలకు, కుడి కాలువ ద్వారా 15 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. దీంతో కుడి ఎడమ కాలువల ఆయకట్టు రైతులు వరి పంటను సాగు చేశారు. జనవరి మాసంలో వారానికి నాలుగు రోజుల పాటు నీటిని విడుదల చేసి మరో మూడు రోజుల నిలుపుదల చేయడంతో రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ మూడోవారం వరకు సాగునీటిని విడుదల చేస్తే పంటలు పూర్తి చేతికి వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గత వారబందీలో 48 గంటలే విడుదల

ప్రాజెక్టు అధికారుల ఆదేశాల మేరకు కుడి, ఎడమ కాలువల ఆయకట్టు రైతులు వరి సాగు చేశారు. మొదట్లో నాలుగు రోజుల పాటు విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో మార్చి మొదటి వారంలో మూడు రోజులే నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో ఏప్రిల్ మొదటివారంలో 48 గంటలు మాత్రమే అంటే రెండు రోజులు మాత్రమే నీటిని విడుదల చేయడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పంట కాలువలకు చివరగా ఉన్న రైతుల పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉన్న క్రమంలో ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న సమాంతర కాలువ ద్వారా నీటిని దిగువకు అక్రమంగా విడుదల చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.



డీ6 కాలువ పరిధిలో ఎండిపోయిన వరి పైరు



నీరులేక వట్టిపోతున్న జూరాల ఎడమ కాలువ



ఎగువ నుంచి విడుదలయితేనే

యాసంగి ప్రారంభ సీజన్‌లో ఎగువ నుంచి స్వల్పంగా వరద వస్తుండేది. మార్చి మొదటి వారం ఎగువ నుంచి వరద పూర్తిగా నిలిచిపోవడంతో ప్రాజెక్టు అడుగంటిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిలువ మూడు టీఎంసీల కు చేరుకున్నది. మిషన్ భగీరథ ద్వారా సాగునీటి లెవెల్‌కు అది సరిపోతుంది. ఎగువ నుంచి నీరు విడుదల అయితేనే కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

- జగన్మోహన్, ప్రాజెక్టు ఈఈ



పంటలు పూర్తయ్యే వరకు సాగునీరు ఇవ్వాలి

ఆత్మకూరు పట్టణ పరిధిలోని ఎడమ కాలువ ఆయకట్టు పక్కనే రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. అధికారుల ఆదేశాల మేరకే పంటలను సాగు చేశాం. మధ్యలో సాగునీటిని నిలిపివేస్తే పంటలు ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. పంటలు పూర్తయ్యే వరకు సాగునీటిని అందించాలి.

- ఎల్లన్న, వరి రైతు, ఆత్మకూరు



తగ్గేదేలే..

- కొండెక్కిన కోడి మాంసం ధరలు
- కిలో రూ.280 పలుకుతున్న చికెన్
- ఉత్పత్తి తగ్గడంతో భారీగా పెరిగిన ధరలు



నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్ని అవాంతరాలు ఎదురైనా బయలర్ కోడి తగ్గేదేలే అంటోంది. ధర విషయంలో కొండెక్కి దిగనంటోంది. మొన్నటి దాకా బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ మార్కెట్ భారీగా పతనమైన విషయం తెలిసిందే. భారీ నష్టాలతో పౌల్ట్రీ రైతులు కోళ్ల పెంపకానికి దూరం కావడం కారణంగా డిమాండ్‌కు తగ్గ సప్లయ్ లేక కేవలం ప్రైవేట్ హెచరీస్‌ల నుంచి మాత్రమే కోళ్ల దిగుమతి ఉండటంతో ఈ మధ్య చికెన్ ధర అమాంతంగా పెరిగింది. రెండు నెలల క్రితం చికెన్ అంటేనే జనం జంకే పరిస్థితులు ఉండేవి. ఈ క్రమంలో కిలో చికెన్ ధర రూ.150కు పడిపోయింది. బర్డ్‌ఫ్లూ భయం పోగొట్టేందుకు పౌల్ట్రీఫాం యజమానులు చికెన్ వంటకాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అయినా మార్కెట్ పుంజుకోలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 67లక్షల 38వేల 73 బాయిలర్, లేయర్, దేశవాళి కోళ్లు ఉండాల్సి ఉండగా, ప్రత్యేక వైరస్ సోకిన కారణంగా నాటుకోళ్లతో సహా టర్కీ కోళ్లు, బాతులు కూడా మృత్యువాత పడ్డాయి. దీంతో భారీగా నష్టపోయిన రైతులు మళ్లీ పౌల్ట్రీ పరిశ్రమ వైపు మొగ్గు చూపడానికి భయపడ్డారు. పెద్ద పెద్ద హెచరీస్‌లో మాత్రమే బాయిలర్ కోళ్లు అందుబాటులో ఉండటం, ఈ నేపథ్యంలోనే రంజాన్, ఉగాది పండుగలు రావడంతో డిమాండ్‌కు తగ్గ సప్లయ్ లేక ధర అమాంతం పెరిగింది. గడిచిన 20రోజుల క్రితం కూడా కేవలం ధర రూ.150 పలికిన చికెన్ అమాంతం కొండెక్కింది. ప్రస్తుత ధర రూ.280కు చేరడంతో కోడి మాంసం కొనుగోలు చేయడానికి జనం పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. పౌల్ట్రీ రైతులు తిరిగి నిలదొక్కుకోవాలంటే జూన్, జూలై వరకు ఆగాల్సిందేనని పౌల్ట్రీ పరిశ్రమ యజమానులు అంటున్నారు.

అకాల వర్షానికి తడిసిన మిరప



రాజోలి: తడిసిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతులు

- రాజోలిలో ఉరుములతో కూడిన వర్షం
- ఉండవల్లి, రాజోలిలో వర్షానికి ముద్దయిన మిరప, మొక్కజొన్న..
- అలంపూరులో తడిసిన పొగాకు
- పరిహారం అందించాలని రైతుల డిమాండ్

రాజోలి/ఉండవల్లి/అలంపూరు ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని పలు మండలాల్లో గురువారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న పంటలు తడిసిపోయాయి. రాజోలి, ముండ్లదిన్నె, తూర్పు గార్లపాడు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం కురిసిని భారీ వర్షానికి ఆర బెట్టిన మిరప, మొక్కజొన్నలు తడిసిపోయింది. దాదాపు గంటన్నర వరకు కురువడంతో పొలా ల్లోకి నీరు చేరింది. పలుచోట్ల చిన్నచిన్న వాగులు, వంకలు పారడంతో రాకపోకలు నిలిచాయి.

ఉండవల్లి, ఇటిక్యాలపాడు గ్రామాల శివారు పంటపొలాల్లో రైతులు నిల్వ ఉంచిన మిరప పూర్తిగా తడిచిపోయింది. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో దాదాపు 200 ఎకరాలోకు పైగా మిరప సాగు చేశారు. చేతికి అందిన పంటను పొలాల్లో నిల్వ చేశామని తెలిపారు.



భారీ వర్షానికి కల్లాల వద్ద నిలిచిన నీరు

కాగా గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి మిరప పూర్తిగా తడిచి పోయింది. అ తడిచిన పంటకు పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అలంపూరు మండలంలో గురువారం కురిసిన అకాల వర్షానికి పొగాకు పంట తడిసిపోయింది. తడిసిన పంట నాణ్యత తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంపెనీ యాజమాన్యాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో పొగాకు పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇటిక్యాల పాడులో కల్లాల్లో తడిసిపోయిన మిరప



ముఖం చూపితేనే హాజరు

- అది కూడా పనిచేసే చోట పరిసరాల్లో ఉంటేనే..
- డుమ్మాలు కొట్టే వారికి ఇక చెక్ పడినట్లే..
- వైద్య ఆరోగ్యశాఖలో అమల్లోకి రానున్న 'అబాస్' విధానం
- వైద్యాధికారి నుంచి అటెండర్ వరకు వివరాల సేకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ

డుమ్మాలు కొట్టే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి ఇక చెక్ పడనుంది. 'మాకు ఇష్టం వచ్చినప్పుడు వెళతాం.. లేదంటే వెళ్లం.. వెళ్లినప్పుడు రిజిష్టర్‌లో సంతకాలు పెడతాం' అనే వారి పప్పులు ఇక ఉడకవు. కచ్చితంగా పనిచేసే చోటుకు వెళ్లి, మొబైల్ ఫోన్‌లోని అబాస్(ఆధార్ బేస్‌డ్ అటెండెన్స్ సిస్టం) యాప్‌లో ముఖం చూపిస్తేనే హాజరు పడనుంది. తెలంగాణ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఈ విధానాన్ని అమల్లోకి తేనుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని వైద్యాధికారి నుంచి అటెండర్ వరకు ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నారు. వివరాల నమోదు పూర్తయిన తర్వాత ఆ విధానాన్ని అమల్లోకి తేనున్నారు.

- మహబూబ్‌నగర్ (వైద్య విభాగం), ఆంధ్రజ్యోతి

జిల్లాల వారీగా ఆరోగ్య కేంద్రాలు, ఉద్యోగుల వివరాలు

జిల్లా పేరు	పీహెచ్‌సీ	సబ్ సెంటర్లు	యూపీహెచ్‌సీలు	ఉద్యోగులు
మహబూబ్‌నగర్	21	200	5	3,200
వనపర్తి	14	96	3	2100
గద్వాల్	10	91	3	1900
నాగర్‌కర్నూల్	14	106	2	2,600
నారాయణపేట	11	87	1	1800
మొత్తం	70	580	14	11,600



నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవఖానాల్లో పనిచేసే డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు ఇతర సిబ్బంది తమకు ఇష్టం వచ్చినపుడు రావడం, వెళ్లడం చేస్తున్నారు. సమయ పాలన పాటించడం లేదు. వంతుల వారీగా విధులకు హాజరవుతున్నారు. మరికొంత మంది వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే వచ్చి మిగతా రోజుల అటెండెన్స్ వచ్చిన రోజు రిజిష్టర్‌లో వేసుకుంటున్నారు. ఇంకొంతమంది క్షేత్రస్థాయి పరిశీలన, సర్వేలు అంటూ విధులకు హాజరుకావడం లేదు. దీనిపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఆరోపణలు కూడా వస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అబాస్‌ను అమల్లోకి తెచ్చింది.

అబాస్ అంటే..

పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది హాజరు నమోదుకు తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ అభివృద్ధి చేసిన మొబైల్ ఆధారిత జియో ఫెన్స్‌డ్ విధానంలో నూతన సాంకేతికతను తెచ్చారు. ఇప్పటి వరకు బయోమెట్రిక్‌తో పాటు ఫేస్ యాప్ ద్వారా హాజరు తీసుకునేవారు. కానీ ప్రస్తుతం అమల్లోకి వచ్చిన అబాస్ విధానంతో హాజరు తీసుకుంటారు. దాంతో గైర్హాజరుకు పూర్తిగా చెక్ పడనుంది. విధులకు డుమ్మా కొట్టే వారిపట్ల కఠినంగా వ్యవహరించేందుకు ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ యాప్ ఉద్యోగులు పనిచేసే ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లోనే ఓపెన్ అవుతుంది. అప్పుడు మొబైల్ ద్వారా ఫేస్ రికగ్నిజేషన్, జియోఫెన్స్‌డ్ విధానంతో హాజరు నమోదు అవుతుంది. ఎక్కడి నుంచో ఈ యాప్‌ను ఓపెన్ చేసి, హాజరు వేయడానికి వీలు ఉండదు. అలా చేస్తే అటెండెన్స్ పడదు. గైర్హాజరు చూపిస్తుంది. ఎక్కడికి వెళ్లినా ఆస్పత్రికి వచ్చి అటెండెన్స్ వేసేలా ఈ యాప్‌ను రూపొందించారు.

11,600 మంది వరకు ఉద్యోగులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 70 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 580 సబ్ సెంటర్లు, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు, 25 బస్తీ దవఖానాలు ఉన్నాయి. వాటి పరిధిలో డాక్టర్లు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఎంపీహెచ్ఎస్‌లు, ఎంపీహెచ్ఈవోలు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది మొత్తం కలిపి దాదాపు 11,600 మంది వరకు ఉద్యోగులు ఉంటారు. డాక్టర్లు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది తమకు ఇష్టం వచ్చినపుడు విధులకు వస్తున్నారు. సమయ పాలన పాటించకపోగా, టూర్‌లు, క్షేత్రస్థాయి పర్యటనలు అంటూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా ఆస్పత్రుల్లోని రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అబాస్ విధానాన్ని అమల్లోకి తేవాలని నిర్ణయించింది.

వివరాల సేకరణ జరుగుతోంది

తెలంగాణ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి అబాస్ విధానం అమల్లోకి తెస్తున్నట్లు ఉత్తర్వులు వచ్చాయి. వాటి ప్రకారం ఆయా జిల్లాల్లో ఎంతమంది ఉద్యోగులు ఉన్నారు, వారి ఆస్పత్రుల లోకేషన్లు, ఆధార్, ఇతర వివరాలు సమర్పించాం. ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందనే దానిపై స్పష్టత లేదు. త్వరలో అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.

- డాక్టర్ కృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మహబూబ్‌నగర్

బోధనా నైపుణ్యాల పెంపునకు శిక్షణ



మహబూబ్‌నగర్‌లో గద్వాల జిల్లా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ ఎం.ఎస్ విజయ్‌కుమార్



పదోన్నతులు పొంది శిక్షణకు హాజరైన గద్వాల జిల్లా ఉపాధ్యాయులు

- పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు నిర్వహణ
- ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయి
- డాక్టర్ ఎంఎస్ విజయ్‌కుమార్, రిసోర్సు పర్సన్

అయిజ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల నైపుణ్యాల పెంపునకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం, వారిని భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు గత నెలలో జిల్లాల వారీగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం పదోన్నతులు పొందిన వారికి శిక్షణ ఇస్తున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని బోధన చేస్తూ విద్యార్థుల సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంచేలా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పద్ధతిలో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. మరో అడుగు ముందుకు వేసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా బోధన చేసేందుకు శ్రీకారం చుట్టింది.

500 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,366 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి లభించింది. వారికి శిక్షణ ఇచ్చేందుకు 98 మంది సీనియర్ ఉపాధ్యాయులను డీఆర్పీలుగా నియమించారు. ఈ నెల 3న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జిల్లాల వారీగా శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రోజు జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదోన్నతులు పొందిన తెలుగు ఉపాధ్యాయులు 500 మంది కాగా, వారికి శిక్షణ కోసం 20 మంది డీఆర్పీలను నియమించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 276 మంది కాగా, 12 మంది డీఆర్పీలను ఏర్పాటు చేశారు. ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు 299 మంది కాగా 12 మంది డీఆర్పీలు, హిందీ ఉపాధ్యాయులు 454 మంది కాగా, 18 మందిని, బయో, ఫిజికల్ సైన్‌కు ఉపాధ్యాయులు 230 మంది కాగా, 10 మంది డీఆర్పీలను కేటాయించారు. సోషల్, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు 265 మందికి 12 మంది, గణితం, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు 342 మంది కాగా, 14 మంది డీఆర్పీలను నియమించారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందుతాయి



శిక్షణతో ఉపాధ్యాయుల్లో బోధనలో నైపుణ్యాలు మెరుగవుతాయి. దీంతో విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందిస్తారు. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయింది. పాఠశాలలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలను ఉపయోగించి, విద్యాబోధనపై వివరించారు. దీంతో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయి.

- డాక్టర్ ఎంఎస్ విజయ్‌కుమార్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్

ప్రతీ ఉపాధ్యాయుడు హాజరుకావాలి



ఎంపికైన ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరు కావాల్సిందే. శిక్షణతో ఉపాధ్యాయులలో బోధనా సామర్థ్యాలు పెంపొందుతాయి. విద్యాభివృద్ధికి మరింత కృషి చేసే అవకాశం లభిస్తుంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి.

- మహ్మద్ అబ్దుల్ ఘనీ, జిల్లా విద్యాధికారి, జోగుళాంబ గద్వాల

కొండారెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక శోభ

- వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన
- ఘనంగా హోమ పూజలు



స్వామివారి సన్నిధిలో వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి

వంగూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి దిద్దబండ ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. 4 రోజుల పాటు నిర్వహించే ఈ పండగకు ఆడపడుచులు, బంధువులు రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. భక్తి శ్రద్ధలతో వేద పండితులు, మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించి అనంతరం కనుల పండువగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠించించారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పులిజాల నిరజ కృష్ణారెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గున్న శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఈవో హిందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా భేరిపూజ



ధ్వజారోహణ పూజలో పాల్గొన్న భక్తులు

వనపర్తి రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో కోదండ రా మస్వామి బ్రహ్మోత్సవాలు (సీతారాముల కల్యాణోత్సం) పురస్కరించు కుని గురువారం రామాలయంలో భేరి పూజ, ధ్వజారోహణం, దేవత హ్వానం పూజలు చేశారు. పూజా కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పా ల్గొన్నారు. శుక్రవారం జరగబోయే సీతారాముల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని, సాయంత్రం వరకు కోలాటాలు నాట కాలతో ఆలయ ఆవరణ అంతా దద్దరిల్లిపోతుందని, రాత్రి సీతారాముల కల్యాణం ఉంటుందని రమణచార్యులు తెలిపారు.



ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ఆవరణలో నేషనల్ యూత్ అవార్డు అందుకుంటున్న కల్వకుర్తికి చెందిన శివకుమార్

కల్వకుర్తి వాసికి నేషనల్ యూత్ అవార్డు

కల్వకుర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ నేషనల్ యూత్ అవార్డు అందుకున్నారు. గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ఆవరణలో భారత యువజన, క్రీడా సర్వీసుల శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దేశంలో 2022-23 సంవత్సరానికిగాను 12 మందికి అవార్డులు దక్కాయని, అందులో తనకు చోటు దక్కడం గర్వకారణమన్నారు. తాను 13 సంవత్సరాలుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పర్యావరణం, వ్యవసాయంలో రైతులకు శివ అగ్రి క్లినిక్ సోషల్ మీడియా ద్వారా సేద్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. సామాజిక చైతన్యం, అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

మహబూబ్‌నగర్, మక్తల్‌లో రెండు కొత్త బార్లు

- ఈనెల 26 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మహబూబ్‌నగర్‌లో ఏడాదికి రూ.42 లక్షలు.. మక్తల్‌లో రూ.30 లక్షలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, మక్తల్‌లో రెండు కొత్తబార్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రెన్యూవల్ కాని బార్ల స్థానంలో కొత్తబార్ల ఏర్పాటుకోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. రాష్ట్రంలో 25 బార్లు ఏర్పాటు చేస్తుండగా అందులో ఉమ్మడి జిల్లాలో రెండు బార్లకు దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ నెల 26లోగా దరఖాస్తులను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. కార్యాలయ పనిదినాలలో ఉదయం 10:30 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆసక్తి గల వ్యక్తులు లక్ష రూపాయల డీడీని సమర్పించాల్సి ఉంటుంది. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ మహబూబ్‌నగర్ పేరుపై డీడీ తీయాల్సి ఉంటుంది. బార్ రాని వ్యక్తులకు డీడీ డబ్బులు తిరిగి ఇవ్వబడవు. ఈనెల 29న ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన నూతన లైసెన్స్‌దారుడిని ఎన్నుకుంటారు. మహ బూబ్‌నగర్‌లో బార్ ఎక్సైజ్ టాక్స్ ఏడాదికి రూ.42 లక్షలు, మక్తల్‌లో రూ.30 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

హరీశ్‌రావు మాటలు హాస్యాస్పదం

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్

కల్వకుర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్ అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బీసీలను, అన్ని వర్గాలను విస్మరించారని విమర్శించారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలోని కడ్తాల మండలం బోయినిగుట్టతండాలో విగ్రహావిష్కరణ అనంతరం హరీశ్‌రావు మాట్లాడిన తీరును తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బీసీలను విస్మరించారని హరీశ్ పేర్కొనడం సరైంది కాదన్నారు.

తెలంగాణలో బీసీల కులగణన చేసి 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చట్టం తెచ్చారని, అయితే బీఆర్ఎస్ పాలనలో కేవలం 18శాతమే అమలుపర్చారని గుర్తు చేశారు. 5వేల ఉద్యోగాలే ఇచ్చారని హరీశ్‌రావు విమర్శించారని, కానీ 62వేల ఉద్యోగాలు ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను బలోపేతం చేసి రూ.6వేల కోట్లతో నాలుగు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా తన మాటలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గతం కంటే కొంత మెరుగు

- ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్, నల్లా బిల్లుల్లో వసూళ్లు
- ఆర్థిక సంవత్సరం చివరి రోజు చివరి నిమిషం వరకు వసూలుపైనే ధ్యాస
- లక్ష్యానికి చేరుకోలేకపోయినా... గతం కంటే ఈ ఏడాది కాస్త మేలు
- ప్రతీ మునిసిపాలిటీలో 50 శాతం దాటిన ఆస్తి పన్ను వసూలు
- 89.25 శాతం వసూలుతో మొదటి స్థానంలో నిలిచిన పెబ్బేరు



చివరి రోజు చివరి నిమిషంలో కూడా ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మునిసిపల్ అధికారులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్, నల్లా బిల్లుల వసూలులో అధికారులు ఈ ఏడాది కాస్త వేగం పెంచారు. ఫలితంగా ఆశించిన స్థాయిని చేరుకోలేకపోయినా... గతంలో కంటే కాస్త మెరుగైన ఫలితాలనే సాధించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో పన్ను వసూలుపై ధ్యాస పెట్టిన అధికారులు వనపర్తి మునిసిపాలిటీలో 18113 అసెస్‌మెంట్‌లకు గాను రూ. 10 కోట్ల 80 లక్షల టార్గెట్‌కు 15 వేలకు పైగా రశీదులు కట్ చేసి రూ. 5,56,86,000 వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన సోమవారం అర్ధరాత్రి వరకు ఆదాయ వసూలు కొనసాగించిన అధికారులు చివరి నిమిషం రాత్రి 11:52 గంటలకు కూడా రూ. 2.38 లక్షల రశీదు కట్ చేశారు. దీంతో వనపర్తి మునిసిపాలిటీలో ఆస్తి పన్నులో 52 శాతానికి చేరుకున్నారు. గత ఏడాది ఆస్తి పన్నును రూ. 4 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో 1700 వ్యాపార సముదాయాలకు గాను రూ. 46 లక్షల టార్గెట్ ఉండగా రూ. 26 లక్షల 70 వేలను వసూలు చేసి 62 శాతానికి చేరుకున్నారు. ట్రేడ్ లైసెన్స్ వసూలు గత ఏడాది కేవలం 18 శాతం మాత్రమే జరిగింది. నల్లా బిల్లుల వసూలులోనే కాస్త వెనుకబడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పట్టణంలో 8183 కనెక్షన్లు ఉండగా రూ. కోటీ 21 లక్షల 99 వేలు వసూలు చేశారు. కానీ నల్లా బిల్లుల టార్గెట్ మాత్రం రూ. 6 కోట్ల 74 లక్షలకు పైగానే ఉంది. గత ఏడాది కేవలం 8.35 శాతం వసూల్ చేసిన నల్లా బిలులు ఈ ఏడాది 18.09 శాతం వసూల్ కావడం కాస్త మెరుగుపడినట్లు తెలుస్తోంది.

ఐదు పురపాలికల్లో గణాంకాలు

జిల్లాలో వనపర్తి, ఆత్మకూర్, అమరచింత, కొత్తకోట, పెబ్బేరు మునిసిపాలిటీలు ఉన్నాయి. ఆయా మునిసిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లలో ఆత్మకూరులో రూ. 10 కోట్ల 94 లక్షల టార్గెట్‌కు గాను రూ. 5 కోట్ల 55 లక్షలు వసూలు చేశారు. అమరచింతలో రూ. 55 లక్షల టార్గెట్‌కు గాను రూ. 40 లక్షలు వసూలు చేశారు. కొత్తకోట మునిసిపాలిటీల్లో రూ. కోటీ 60 లక్షల టార్గెట్‌కు గాను రూ. కోటీ 6 లక్షలు వసూలు చేశారు. పెబ్బేరు మునిసిపాలిటీలో రూ. 93 లక్షల టార్గెట్‌కు గాను రూ. 83 లక్షలు వసూల్ చేశారు. ఆస్తి పన్ను వడ్డీపై గత నెలలో ప్రభుత్వం 90 శాతం రాయితీని ప్రకటించడంతో అధికారులు పన్ను వసూళ్లపై సెలవు రోజుల్లో సైతం ఇంటింటికి తిరిగి పన్ను వసూలు చేశారు. పెబ్బేరు మునిసిపాలిటీ 89.25 శాతం వసూల్ చేసి మొద టి వరుసలో నిలిచింది. తరువాత స్థానాల్లో అమరచింత, కొత్తకోట, ఆత్మకూరు, వనపర్తి మునిసిపాలిటీలు నిలిచాయి.

ప్రత్యేక బృందాలతో నిర్విరామంగా వసూలు చేశాం....



మునిసిపాలిటీకి చెందిన పన్ను వసూలుపై గత నెల రోజుల పాటు ఆయా శాఖల అధికారులను పురమాయించి ప్రత్యేక బృందాల ఏర్పాటుతో నిర్విరామంగా ఆదాయం సమకూర్చడంపై దృష్టి పెట్టాం. సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహించాం. చివరి రోజు చివరి నిమిషం వరకు కూడా ఇంటింటికి తిరిగి ఆస్తి పన్ను వసూలు చేయడం వెనుక ప్రతీ ఒక్కరి కృషి ఎంతో ఉంది. గతంలో 35 నుంచి 40 శాతం మాత్రమే వసూలు అయ్యేది. కానీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో అధికారుల సహకారంతో ఏకంగా 52 శాతం వసూలు చేయగలిగాం. భవిష్యత్తులో కూడా పట్టణ ప్రజలు సకాలంలో మునిసిపాలిటీ పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

- వెంకటేశ్వర్లు, వనపర్తి మునిసిపల్ కమిషనర్

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ముమ్మరంగా శిథిలాల తొలగింపు

- ఐదు యంత్రాలతో కన్వేయర్ బంకర్‌లోకి మట్టి, బురద తరలింపు
- ఒక్క రోజులో 15 మీటర్ల వరకు శిథిలాల తరలింపు

దోమలపెంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఏప్రిల్ 10 వరకు గడువు విధించింది. అయినప్పటికీ సహాయక చర్యలు చేపడుతున్న ప్రాంతంలో ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ రెస్క్యూ బృందాలు నిర్విరామంగా పనులు చేపడుతున్నారు. గురువారం నాటికీ ప్రమాద ఘటన జరిగి 41 రోజులు అయింది. 13.600 కిలో మీటర్ల నుంచి 13.730 మీటర్ల వరకు 15 అడుగుల ఎత్తుకు పేరుకుపోయి ఉన్న శిథిలాలను తొలగించేందుకు 100 మీటర్ల కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించి సిద్ధం చేశారు. గురువారం మొదటి షిఫ్ట్‌లో సొరంగంలోకి వెళ్లిన రెస్క్యూ బృందాలు శిథిలాల తొలగింపు పనులు ప్రారంభించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. డేంజర్ జోన్‌గా ఉన్న 43 మీటర్లను మినహాయించి.. 155 మీటర్ల వరకు పేరుకుపోయి ఉన్న శిథిలాలను 15 మీటర్ల వరకు తొలగించారు. ఇందుకు 5 ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి కన్వేయర్ బెల్ట్‌పై బురద మట్టిని పోస్తూ బయటకు తరలిస్తున్నారు. ఉబికి వస్తున్న 10 వేల లీటర్ల ఊట నీటిని బయటకు పంపింగ్ చేసేందుకు 150 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 5 మోటారు పంపులను ఉపయోగిస్తున్నారు. కాగా, శుక్రవారం మొదటి షిఫ్ట్ వరకు మరో 5 మీటర్ల శిథిలాలను తొలగించేందుకు రెస్క్యూ పనుల్లో పాల్గొనే సిబ్బంది లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. అయినా విరిగి పడిన టీబీఎం మిషన్ విడిభాగాలు మట్టిలో కూరుకుపోయి ఉన్నందున వాటిని కత్తిరించుకుంటూ పనులు చేయాల్సి వస్తుంది. అందరి సమన్వయంతో పనులు కొనసాగితే ఈనెల 20 వరకు శిథిలాలను పూర్తిగా తొలగించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. సహాయక చర్యల్లో ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్‌కుమార్, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి డాక్టర్ హరీష్, సింగరేణి రెస్క్యూ మైన్స్ జీఎం బైద్య, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, జయప్రకాష్, రైల్వే అధికారి రవీంద్రనాథ్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బురద మట్టిని ఎత్తిపోస్తున్న ఎక్స్‌కవేటర్

వ్యాపారి దృష్టి మరల్చి.. ఆరు తులాల బంగారం చోరీ

- బంగారు దుకాణంలో మహిళల చేతివాటం



సీసీ కెమెరా ఫుటేజీలో కన్పించిన మహిళలు

కొత్తకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బంగారు దుకాణంలో గుర్తుతెలియని మహిళలు చేతివాటం చూపించారు. ఆరు తులాల బంగారు బిళ్లను ఎత్తుకెళ్లారు. వనపర్తి జిల్లా, కొత్తకోటలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శివ హనుమాన్ జ్యువెలరీ షాపుకు గురువారం ముగ్గురు గుర్తు తెలియని మహిళలు, ఇద్దరు బాలికలు వచ్చారు. వ్యాపారితో మాట్లాడుతూ అతడి దృష్టి మళ్లించారు. పక్కనే ఉన్న ఇద్దరు బాలికల్లో ఒకరు చాకచక్యంగా స్టూల్‌పైకి ఎక్కి ఆరు తులాల బంగారు బిళ్లను తీసుకున్నది. ఆ తర్వాత ఆమె సైగ చేయడంతో అందరూ దుకాణం నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిన తర్వాత బంగారు బిళ్ల మాయం అయ్యిందని గుర్తించిన వ్యాపారి దుకాణంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించాడు. ఓ బాలిక స్టూల్ ఎక్కి బంగారు బిళ్లను తీసుకున్న దృశ్యం కనిపించింది. దీంతో అతడు కుటుంబసభ్యులకు తెలిపి పట్టణంలో వెతికారు. ఎక్కడా మహిళల ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉమ్మడి పాలమూరులో పలు దొంగతనాలు

వెల్దండ/ మక్తల్/ రేవల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో చోరీలు జరిగాయి. దొంగలు బంగారం, వెండి, నగదును ఎత్తుకెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని సల్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. సల్లపల్లికి చెందిన రాములు బుధవారం అదే గ్రామానికి చెందిన తన తమ్ముడి ఇంట్లో జరిగిన విందుకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. విందు ముగిసిన తర్వాత రాత్రి ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా కిలో వెండి, కొంత బంగారం, నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు ఏశారు. ఎస్ఐ కురుమూర్తి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.1.5లక్షలు చోరీ

నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలో పట్టపగలు రూ. 1.50 చోరీకి గురయ్యాయి. ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాగనూరు మండలంలోని నేరడ్‌గం గ్రామానికి చెందిన నాగప్ప గురువారం మక్తల్ ఎస్‌బీఐ బ్రాంచి నుంచి రూ.1.50 డ్రా చేశాడు. ఆ డబ్బును తన ద్విచక్రవాహనం కవర్లో ఉంచి, పక్కనే ఉన్న జిరాక్స్ సెంటర్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి నగదు మాయం అయ్యింది. దీంతో ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫర్టిలైజర్ షాఫ్‌లో...

వనపర్తి జిల్లా, రేవల్లి మండల కేంద్రంలో కొండూరు బాలేశ్వర్ ధనలక్ష్మి ట్రేడర్స్ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణంలో చోరీ జరిగింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కొండూరు బాలేశ్వర్ బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి తాళం చెవిని డ్రైవర్ నరేశ్‌కు ఇచ్చాడు. గురువారం ఉదయం ఆరు గంటలకు నరేశ్ దుకాణం వద్దకు రాగా తాళం విరగ్గొట్టి ఉన్నది. దీంతో యజమాని బాలేశ్వర్‌కు సమాచారం అందించాడు. ఆయన వచ్చి లోనికి వెళ్లి పరిశీలించగా, గల్లాపెట్టెలో ఉన్న రూ. 10 వేలు కనిపించలేదు. దీంతో ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రాజాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండల పరిధిలోని రాయపల్లి శివారులో గురువారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఇసుక లోడ్‌తో వస్తున్న టిప్పర్‌ను ఆపి తనిఖీ చేశారు.

అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్, యజమాని రాఘవేందర్‌పై కేసు నమోదు చేశారు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్రైం కార్నర్

వరికోత యంత్రంలో పడి బాలుడి మృతి


జీవన్ (ఫైల్)

మల్దకల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పొలంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు వరికోత యంత్రంలో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజు, అఖిల దంపతుల కుమారుడు జీవన్ (8) తల్లిదండ్రులతో పాటు పొలానికి వెళ్లాడు. పొలంలో మొక్కజొన్న పంట కోత అనంతరం సమీపంలో ఉన్న మరో పొలానికి ఆడుకుంటూ బాలుడు వెళ్లాడు. ఆ పొలంలో పంటను యంత్రంతో కోస్తుండగా గమనించని బాలుడు ప్రమాదవశాత్తు యంత్రంలో పడి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా రాజు, అఖిల దంపతుల ఒక కుమాడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనలో డ్రైవర్ సుభాష్‌రెడ్డిపై కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ నందీకర్ దర్యాప్తు చేసిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

▸ చిమనగుంటపల్లి రామాలయంలో ఘటన

వనపర్తి రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై ఓ కూలీ మృతి చెందాడు. వనపర్తి మండల పరిధిలోని చిమనగుంటపల్లి గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన లట్టు శివయ్య (50) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవం కోసం ఆలయాన్ని శుభ్రం చేస్తుండగా, గుడి పక్కనే ఉన్న నిచ్చెనను పక్కకు తీస్తుండగా పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో శివయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గండీడ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన మాల్కాడి వెంకటయ్య(58) బుధవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వస్తుండగా, గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనపై అతడి కుమారుడు మల్లేశ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్దకల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ నందీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల పరిధిలోని అడవిరావులచెరువు గ్రామానికి చెందిన నాగరాజు (37) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడు కడుపునొప్పి భరించలేక బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగరాజు భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్కా చెల్లెళ్లు అదృశ్యం

రాజాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లు అదృశ్యం అయ్యారని ఎస్‌ఐ శివానందం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రా మానికి చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లకు అయిన వారు ఎవరూ లేరు. ఈ నె ల ఒకటిన ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. దీంతో పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం బంధువు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పెబ్బేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మునిసిపాలిటీలో రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ యుగంధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి మండలం నాచహళ్లి గ్రామానికి చెందిన విష్ణుచారి కార్పెంటర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం పెబ్బేరులోని కొల్లాపూర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన సిమెంట్ లారీ ఢీకొన్నది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతడిని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

వంగూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని శ్రీశైలం క్రాస్ రోడ్డు వద్ద ఇటీవల వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో వంగూరుకు చెందిన బాషమోని కిరణ్‌కుమార్, చారకొండ మండలం, తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నాయిని రామస్వామి, అమ్రాబాద్ మండలం, బీకే లక్ష్మాపూర్‌కు చెందిన చింతం ఆంజనేయులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి, గురువారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచారు. వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈత... కారాదు గుండె కోత!

- సరదాగా ఈతకు వెళ్లి బాలబాలికల మృత్యువాత
- కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్న పెద్దలు
- ప్రతీ ఏడాది వేసవిలో జరుగుతున్న సంఘటనలు
- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం



అయిజ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ముదురుతున్నాయి. వేసవిలో ఉక్కపోతకు చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఇబ్బంది పడుతూ ఉంటారు. ప్రతీ ఏడాది మార్చిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రారంభమవుతాయి. ఉదయం బడికి పోయి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తరువాత బడులకు సెలవులు కావటంతో విద్యార్థులు ఒకరికి ఒకరు కలిసి చెరువులు, కుంటలు, నదులు, బావులు, కాలువల్లోకి సరదాగా ఈతకు వెళ్తుంటారు. ఈత రాని వారు నేర్చుకునేందుకు వారి వెంట వెళ్తుంటారు. ఈ క్రమంలో ఈత సరిగా రాకనో, ఇతర కారణాల వల్లనో కొందరు నీటిలో మునిగి చనిపోతున్నారు. వారిని కాపాడే క్రమంలో కొందరు పెద్దలు కూడా నీట మునిగి చనిపోయిన సంఘటనలున్నాయి. తాజాగా బుధవారం రాజోళి మండలంలోని సుంకేసుల వద్ద తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు సులేమాన్ (47), ఆయన ఇద్ద రు కొడుకులు ఫర్హా న్ (11), ఫైజాన్ (9)లు మృతి చెం దారు. ప్రతీ ఏడాది వేసవిలో ఇటువంటి సంఘటనలు ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంటాయి.


నదిలో మునిగి చనిపోయిన అయిజ మండలం, రాజాపురం గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థిని గాయత్రి (ఫైల్).


బావిలో ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన ఇంటర్ విద్యార్థి భూపతిగౌడు (ఫైల్).


నీటిలో మునిగి మృతిచెందిన మూగోనిపల్లి గ్రామానికి చెందిన 6వ, తరగతి విద్యార్థి నరేశ్ (ఫైల్).

గతంలో జరిగిన కొన్ని సంఘటనలు

- 2022, మే 4వ తేదీన అయిజ మండలం, రాజాపురం గ్రామానికి చెందిన ఏడవ తరగతి చదివే గాయత్రి అనే బాలిక బంధువు ల పెళ్లికి వెళ్లింది. సరదాగా తుంగభద్ర నదికి ఈతకు వెళ్లి ప్రమాదవ శాత్తు నీట మునిగి మరణించింది.
- గత ఏడాది మార్చి 16వ తేదీన అయిజ మండలం, మూగోనిపల్లి గ్రామానికి చెందిన నరేశ్ అనే ఆరవ తరగతి చదివే విద్యార్థి బావిలో ఈతకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు.
- మార్చి 21వ, తేదీన మల్దకల్ మండలం, ఉలిగెపల్లి గ్రామా ని కి చెందిన 12 ఏళ్ల వీరేంద్ర అనే బాలుడు స్నేహితులతో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు.
- మార్చి 23వ, తేదీన అయిజ మండలం, చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన ఇంటర్ చదివే భూపతిగౌడు అనే విద్యార్థి బావిలో ఈతకు వెళ్లి మరణించాడు.
- ఏప్రిల్ 2వ, తేదీన ధరూరు మండలం, గార్లపాడుకు చెందిన 11 ఏళ్ల మమత అనే బాలిక ఈతకు వెళ్లి బావిలో మునిగి ప్రమాదవశాత్తు మరణించింది.
- ఏప్రిల్ 10వ తేదీన దేవరకద్ర మండలానికి చెందిన శివకుమార్, గణేశ్ అనే యువకులు ఈత కోసం బావిలోకి దిగి ఈత రాకపోవటంతో నీట మునిగి చనిపోయారు.
- మే 4వ, తేదీన గద్వాల జిల్లా కేంద్రలోని లింగంబావిలోకి ఈ తకు వెళ్లిన రంగస్వామి ప్రమాదవశాత్తు మృతి చెందాడు.
- మే 16వ, తేదీన అమ్రబాద్ మండలానికి చెందిన రిషి కుమార్ అనే గురుకుల విద్యార్థి నీటికుంటలో పడి మృతి చెందగా, మాడ్గులకు చెందిన కుమార్ అనే యువకుడు బావిలోకి ఈతకు వెళ్లి చనిపోయాడు.
- 2మే 24వ, తేదీన నవాబుపేట మండలానికి చెందిన ఆంజనేయులు అనే యువకుడు చెరువులో ఈత కొడుతూ నీట మునిగి పోయాడు.

పిల్లలను కనిపెడుతూ ఉండాలి

వేసవి కాలంలోని ఏప్రిల్, మే నెలలు చిన్న పిల్లలకు చాలా కీలకం. ఈ రెండు నెలలు విద్యా సంస్థలకు ఒంటిపూట బడులు, సెలవులు ఉండటంతో పిల్లలను అనునిత్యం ఒక కంట కనిపెడుతూ ఉండాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. ప్రధానంగా పిల్లలు ఈత నేర్చుకునేందుకు తప్పనిసరిగా ఈత వచ్చిన పెద్దలను వెంటే వెళ్లాలి. ఒంటరిగా, స్నేహితులతో కలిసి వెళ్లడం ప్రమాదకరం. పెద్దలు అప్రమత్తంగా లేకపోతే అనుకోని ప్రమాదాలు జరిగి విషాదాలు సంభవించే ప్రమాదం ఉంది.

తప్పనిసరిగా ఈత నేర్పించాలి



బాల, బాలికలకు 15 సంవత్సరాలు వచ్చే సరికి తల్లిదండ్రులు తప్పనిసరిగా ఈత నేర్పించాలి. ప్రస్తుతం వందలో 90 మంది పిల్లలకు ఈత రావడం లేదు. చిన్నప్పుడు కుటుంబ పెద్దలు మాకు బావికి, లేదా నదికి తీసుకెళ్లి ఈత నేర్పించేవారు. కానీ ప్రస్తుతం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పించడం లేదు. దీంతో అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు.

- లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గద్వాల

పిల్లలపై పర్యవేక్షణ ఉండాలి



ఒంటిపూడ బడులు, వేసవి సెలవుల్లో తల్లిదండ్రులకు పిల్లలపై పర్యవేక్షణ ఉండాలి. బడుల నుండి వచ్చిన తరువాత వారు ఎక్కడికి వెళ్తున్నదీ కచ్చితంగా గమనిస్తూ ఉండాలి. అవసరమైతే ఇంటివద్దే ట్యూషన్ లాంటివి పెట్టించాలి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల పిల్లలు వారి తల్లిదండ్రులు ఇళ్ల వద్ద ఉండకపోవడంతో, మధ్యాహ్నం వేళల్లో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.

- శ్రీనివాసరావు, ఎస్‌ఐ, అయిజ

యువజన విభాగాన్ని బలోపేతం చేయాలి

- జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలి
- యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి అరవింద్‌కుమార్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లాలో యువజన విభాగాన్ని బలోపేతం చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి అరవింద్‌కుమార్ యాదవ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్‌లోని అన్ని విభాగాలకు కమిటీలను నియమించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ రూపొందించిన కరపత్రాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అప్రతిష్టపాలు చేసేందుకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. హెచ్‌సీయూ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అవేజ్, నాయకులు శివంత్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, వాసుయాదవ్, సల్మాన్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సంజీవ్‌రెడ్డి, సలావుద్దీన్, ఫైజాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థుల గగన విహారం

- నేడు శంషాబాద్ నుంచి బెంగళూరుకు విమాన ప్రయాణం


విమాన ప్రయాణానికి బయలు దేరుతున్న విద్యార్థులు

మరికల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మరికల్ మండలంలోని చిత్తనూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురికి విమానంలో ప్రయాణించే అవకాశం లభించింది. యువకమండలి జిల్లా అధ్యక్షుడు మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిత్తనూరుకు చెందిన గుంటికాడి లక్ష్మన్న కుమార్తె గుంటికాడి రాణి ప్రముఖ కార్పొరేట్ సంస్థలో పని చేస్తున్నారు. తాను పుట్టిన ఊరికి, తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఫ్యూచర్ టీచ్ ఫౌండేషన్ (ఎఫ్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంస్థ ఆధ్వర్యంలో గత సంవత్సరం నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షల కోసం 5, 6వ తరగతి విద్యార్థులకు 45 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిపరీక్ష - 2024 లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను విమాన ప్రయాణానికి ఎంపిక చేశారు. విమాన యాత్రకు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ సహాయ సహకారాలు అందిస్తోంది. అందుకోసం ఎంపికైన విద్యార్థులు జి.పల్లవి, బి.నిక్షితశ్రీ, ఎం.అక్షిత, పి.చైత్ర, ఎం.స్నేహ, ఎం. అశోక్‌లు రెండవ తేదీన గ్రామం నుంచి బయలు దేరి వెళ్లారు. నాలుగవ తేదీన వారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరుకు విమానంలో వెళ్లనున్నారు. అక్కడ రెండు రోజుల పాటు విహరించి మూడవ రోజు గ్రామానికి బయలుదేరుతారు. ఈ సందర్భంగా వారిని కుటుంబసభ్యులు, గ్రామస్థులు బాలకృష్ణ, హరీశ్, విష్ణు, మహేశ్, నరేశ్, సాయిలు, లక్ష్మన్న, వెంకట్రాములు అభినందించారు.

పేదలకు అందుబాటులోకి సన్నబియ్యం

- ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


గగ్గలపల్లిలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రజారాజ్యంలో ధన వంతులు తినే సన్నబియ్యం పేదలకు అందుబాటులోకి తెచ్చి పంపిణీ చేస్తు న్నామని ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గురువారం పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్, చెన్నపురావుపల్లి, నారాయణపల్లి, మారేడుమానుదిన్నె గ్రామాల్లోని రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశంలో ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్ర భుత్వంలో పేద ప్రజలకు రేషన్ కార్డులు, డబుల్‌బెడ్రూంలు, రైతులకు రెం డు లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదని ఆరోపించారు. జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీవో బన్సిలాల్, జిల్లా పౌరసరఫరాల అధికా రి శ్రీనివాస్, ఎమ్మార్వో జేకే.మోహన్, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, నా యినోనిపల్లి మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూరి విష్ణు, మాజీ ఎంపీటీసీ సభ్యులు దండు నరసింహ, రవికుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, మేకల గౌరమ్మ, మాజీ సర్పంచ్‌లు వి.సత్యం, రమేశ్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపాల్‌రావు, నాయకులు చంద్రయ్యయాదవ్, మధుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ గువ్వల రాముడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రితో కలిసి సన్నబియ్యం పంపిణీ

పేదలకు ఆర్థిక భారం తగ్గించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబి య్యం పంపిణీ చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గగ్గలపల్లిలో సన్నబియ్యం పథకాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ రైతుల కష్టానికి గౌరవాన్ని కల్పించడంతో పాటు పేద ప్రజలు ఆకలికి గురి కాకుండా పోషకాహారాన్ని అందించడమే ఈ పథక ప్రదానోద్దేశమని అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పథకం సజావుగా అమలవ్వాలని, బియ్యం పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలు సహించేది లేదని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఆర్డీవో తదితరులు పాల్గొన్నారు.

అభద్రతకు గురికావొద్దు

- జీపీవోల సర్వీస్‌పై రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

మహబూబ్ నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలోకి వస్తున్న జీపీవో (గ్రామ పరిపాలన అధికారి)లు సర్వీసు పరమైన అభద్రతకు గురికావలసిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణలో గ్రామం నుంచి రాష్ట్ర స్థాయివరకు రెవెన్యూ వ్యవస్థ పునర్ నిర్మాణం అవుతున్నదని అన్నారు. గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆప్షన్‌ల ద్వారా నియామకం అవుతున్న జీపీవోలందరికీ కామన్ సర్వీస్ ఉంటుందన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి వచ్చినట్లుగానే ప్రతీ జీపీవోకు పదోన్నతులు ఉంటాయని అన్నారు. ప్రజాప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన భూ భారతి చట్టంతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని సూచించారు. ప్రతీ రెవెన్యూ ఉద్యోగి గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలన అధికారులను నియామకం చేయనున్నట్లు తెలిపారు. దీనివలన రైతులకు రెవెన్యూ సేవలు చేరువకావడంతో పాటు రెవెన్యూ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు లభిస్తాయని అన్నారు.

అయితే భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలని అన్నారు. భూ భారతి చట్టంలో రెవెన్యూ శాఖ బలోపేతం కావడంతో పాటు రైతులకు గ్రామ స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా నియామకం చేస్తుందన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల ఆకాంక్షకు ప్రభుత్వ సహకారం తోడవడంతో రెవెన్యూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సాధించుకున్నామని అన్నారు.

భూభారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోకి సీసీఎల్‌ఏ నుంచి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీ కరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కా రం అవుతాయన్నారు. జీవో 317 రాష్ట్ర ఉద్యోగులను చిన్నా భిన్నం చేసిందన్నారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా 317 జీవోలోని నిబంధనల ను ప్రభుత్వం సడలించిదన్నారు. వేరు వేరు జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగుల ను తిరిగి స్వంత జిల్లాలకు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 61 సంవత్సరాల పైబడిన వీఆరోవోలను సర్దుబాటు చేసి వారి కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, కోశాధికారి వెంకట్ రెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. రాధ, సీసీఎల్ఏ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ చైతన్య, రాంబాబు, కోశాధికారి మల్లేశం, టీజీఆర్ఎస్ఏ మహిళా విభాగం అధ్యక్షులు సుజాత చౌహాన్, టీజీటీఏ ఉ పాధ్యక్షుడు పాల్ సింగ్, పూర్వపు వీఆర్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేందర్ రావు, మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, నారాయణపేట అదనపు కలెక్టర్ బెన్‌షాలం, ఆర్‌డీవో నవీన్, డిప్యూటీ కలెక్టర్ అరుణా రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిధిలోని తహసీల్దారులు, టీజీటీఏ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘన్సీరామ్, ఇబ్రహిం, రమేశ్ రెడ్డి, జిలానీ, వీరబ్రద్రప్ప, నరేందర్, తదితరలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ఎండ తీవ్రత పెరగకముందే పనులు ముగించుకోవాలి

- స్వప్న, వైద్యాధికారి, ఉప్పునుంతల



ఉప్పునుంతల ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎండ తీవ్రత పెరగక ముందే రైతు, కూలీలు పనులు ముగించుకునేలా చూసుకోవాలని ఉప్పునుంతల ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి స్వప్న ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

వేసవిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవిలో తప్పనిపరిస్థితిలో బయటికి వెళ్లాల్సి వస్తే తలకు తువాలు కట్టుకోవాలి. లేదా గొడుగైనా పెట్టుకోవాలి. ప్రతీ అరగంటకు ఒకసారి తప్పకుండా నీళ్లు తాగాలి. బయటికి వెళ్లి వచ్చి కూల్ వాటర్ తాగవద్దు. అదే విధంగా వేసవి కాలంలో కాటన్ దుస్తులు లూజుగా ధరించేలా చూసుకోవాలి

ఆసుపత్రిలో సరిపడా వైద్య సిబ్బంది ఉన్నారా, మందుల కొరత ఉందా ?

సీహెచ్‌సీ ఆసుపత్రి అయినప్పటికీ పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్య సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. మందుల కొరత లేదు

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా

మండల ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. అదే విధంగా రైతులకు ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నాం. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే వెంటనే ఆసుపత్రికి రావాలి.

రోగులకు భోజనం అందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆసుపత్రిలో చేరిన ప్రతీ రోగికి భోజనం, తాగునీరు కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

బీజేవైఎం నాయకుల అరెస్టు

ఉప్పునుంతల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 400 ఎకరాల హెచ్‌సీయూ భూమి వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ పిలుపులో భాగంగా సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజుతో పాటు బీజేవైఎం నాయకులు శ్రీకాంత్, శివ, రాకేష్‌లను గురువారం ఉప్పునుంతల పోలీసులు ముందుస్తు అరెస్టు చేశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

సీతారామ కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

కోడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోడేరులో ఈ నెల 5వ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్రీ సీతారామస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగినేని జగదీశ్వర్‌రావు తెలిపారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు శ్రీ గణపతి నంది భవాని శివుడు విగ్రహాలు, శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి మూల విగ్రహాలకు మహాభిషేకం, అలంకరణ పూజ కార్యక్రమంతో ప్రారంభమవుతుందన్నారు. ఆదివారం సీతారామ కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు గుమ్మడి నరసయ్యకు పురస్కారం

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చింతలపల్లి నిర్మలాదేవి నారాయణరావు జీవన సాఫల్య పురస్కారాన్ని ఈ ఏడాది ఆదివాసి హక్కుల పోరాటయోధుడు, ఇల్లెందు మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నరసయ్యకు అందజేయనున్నట్లు సీఎన్‌ఆర్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని తిరుమల ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్న అవార్డు ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్న, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని కవులు, కళాకారులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలి

తాడూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం యువతకు అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం లాంటి ఉపాధి అవకా శాలు, ప్రభుత్వం అందిస్తున్న ఇతర సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో రాజీవ్ యువ వికాసంపై పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రాజీవ్ యువవికాసం కోసం ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఎంపీవో, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణ ప్రజలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఉంటుందని మునిసిపల్ మహమ్మద్ షేక్ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించే యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

13న భీమ్‌దీక్ష సభ

తెలకపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరెడ్డిపల్లి గ్రామంలో స్వేరోస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న జరగబోయే భీమ్‌దీక్ష ముగింపు సభ వాల్ పోస్టర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ గురువారం విడుదల చేశారు. రాష్ట్ర సోషల్ మీడియా వారియర్ సంపత్‌కుమార్, శేఖర్, శ్రీను, వెంకటేష్, లక్ష్మణ్, ఆంజనేయులు, బాలరాజు, కాశీం, బాలకృష్ణ, చిన్న బాలయ్య పాల్గొన్నారు.

పేదలందరికీ పౌష్టికాహారం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి

బిజినేపల్లి/ తాడూరు/ తిమ్మాజిపేట/ ఊర్కొండ/ వంగూరు/ ఉప్పునుంతల/ చారకొండ/ కొల్లాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజాపాలన ప్రభుత్వంలో పేదలందరికీ నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేపట్టి పౌష్టికాహారం అందిస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బిజినేపల్లిలోని 31వ రేషన్ షాపులో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి గురువారం సన్న బియ్యం పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం అందజేసి మాట్లాడారు. అలాగే మంగనూర్‌లోని రేషన్ షాపుల్లో సన్నబియ్యం పథకం ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేష్ కుమార్, తహసీల్దారు శ్రీరాములు, నాయబ్ తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దెరాములు, వెంకటస్వామి, అమృత్‌రెడ్డి, డీలర్లు వెంకటేష్ గౌడ్, రంగ రాజు ఉన్నారు. ● తాడూరులో ఉచిత సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఆర్డీవో, మండల నాయకులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ● తిమ్మాజిపేటలోని రెండు రేషన్‌దుకాణాల్లోను, గొరిట రేషన్ షాపులో గురువారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బహదూర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు దానం బాలరాజు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంపీడీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు.



బిజినేపల్లిలో లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి

● వంగూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్ర మం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్‌రావు, ఎంపీడీవో బ్రహ్మాచారి, వేమారెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు. ● ఉప్పునుంతలలోని 1, 2 రేషన్ దుకాణాల్లో గురువారం సన్న బియ్యం పంపిణీని వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి ప్రారంభించారు. అందరూ సన్నబియ్యం అన్నం తినాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.



వంగూరు : పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కేవీఎన్‌రెడ్డి

తహసీల్దార్ ప్రమీల, నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, డీలర్లు కుమార స్వామి, బాలస్వామి ఉన్నారు. ● చారకొండ మండలంలోని చారకొండ, జూపల్లిలో రేషన్ షాపుల వద్ద సన్న బియ్యం పథకాన్ని అధికారులు, నా యకులతో కలిసి రాష్ట్ర వ్యవసాయ కమిన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి ప్రారంభించి బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, డైరెక్టర్ జగన్‌మోహన్, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు, మార్కెట్ డైరెక్టర్ ముస్తఫాముజ్జుబాయి, డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలరాం గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శులు మహేందర్, బాలరాజు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఊర్కొండ : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు అందజేస్తున్న సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామ్‌కోటి, ఎంపీడీవో కృష్ణయ్యలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పథకం ప్రారంభించారు.

గురుకుల ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- సన్మానించిన మంత్రి జూపల్లి, డీఈవో

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ఐదవ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలలో మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పలువురిని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, డీఈవో రమేష్ కుమార్ అభినందించారు. కల్వకోల్‌లోని చందు కాన్సెప్ట్ స్కూల్లో చదువుతున్న 16మంది విద్యార్థినీ, విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో గురుకుల ర్యాంకులు సాధించారు. చందు కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం కరస్పాం డెంట్ ఇంద్రకంటి శేఖర్, ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయ బృందాన్ని మంత్రి అభినందించారు.

కల్వకోల్ శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన చటమోని ఉష్ణశ్రీ (363), రాచాల రిషిక (985), సంగనమోని సాయిలక్ష్మి (1411), మొగిలి తన్మయి (1661), పలువురు 10,000 లోపు ర్యాంకులు సాధించారు. హెచ్‌ఎం రాచాల సుదర్శన్‌గౌడ్ అభినందించారు.



గురుకుల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

విద్యార్థికి అభినందన

● తెలకపల్లి : మండలంలోని తాళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన నీలబిందు అనే విద్యార్థినీ గురుకుల ప్రవేశ పరీక్షలో జిల్లా స్థాయి మొదటి స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థిని డీఈవో రమేష్‌కుమార్ అభినందించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి నీలబిందు జిల్లా మొదటి స్థానంలో నిలిచినం దుకు అభినందించారు. అలాగే ప్రతి పాఠశాలలో ఇలాగే ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు. తాళ్లపల్లి ప్రధానోపాధ్యాయులు మల్లేష్‌ను డీఈవో, ఎంఈవోలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు బర్పటి వెంకటయ్య, ఫర్ఫుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, జీసీడీవో శోభారాణి, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరగిరిలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు

కొల్లాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి గ్రామలో పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్ విద్యార్థులు గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కపోలోనియస్ ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ అమరగిరి గ్రామంలో ఆరోగ్య, పొదుపు, ప్రభుత్వ పథకాలు గురించి వారు తీసుకోవాల్సిన శుచి శుభ్రతపై ఇతర పలు అంశాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంతోష్ కుమార్, గ్రామ పంచాయతీ సెక్రటరీ నాగరాజు, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్ సౌమ్య, పీజీ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, బీజేపీ కార్యకర్త భరత్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కమిటీ ఎన్నిక

బల్మూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల ఫొటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక గురువారం మండల కేంద్రంలో అచ్చంపేట ఫొటో, వీడియో గ్రాఫర్ల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మండల కమిటీ అధ్యక్షుడు కాట్రావత్ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా కాట్రావత్ గణేష్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా ఎండి.రఫీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట తాలూకా అధ్యక్షుడు తాటికొండ గిరి, జిల్లా ఉపాధ్యక్షుడు షకీల్, తాలూకా కోశాధికారి నాయకపు సలేశ్వరం, మాజీ అధ్యక్షుడు నారాయణగౌడ్, బల్మూరు మండల మాజీ అధ్యక్షుడు ఇట్టి శేఖర్, సీనియర్ ఫొటో గ్రాఫర్ శత్రునాయక్, నాగయ్యగౌడ్, రాజేష్, మధుయాదవ్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



ఫొటో, వీడియోగ్రాఫర్ల మండల కమిటీ సభ్యులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అచ్చంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట ఆసుపత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మార్చి 31వ తేదీన అచ్చంపేట పట్టణంలో అపస్మారక స్థితిలో ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని గుర్తించిన ప్రయాణీకులు అచ్చంపేట సివిల్ ఆసుపత్రిలో చేర్పించారు. మృతి చెందిన వ్యక్తి తరపు వారెవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని అచ్చంపేట ఎస్‌ఐ రమేష్ కోరారు.

యువకుడి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన కేశ రవీందర్ కన్పించడం లేదని తన అన్న కేశరాము ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. వివరాల ప్రకా రం.. నర్సాయిపల్లి గ్రామానికి చెందిన కేశ రవీం దర్ ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామంలో స్నేహ కంపెనీలో పని చేస్తున్నాడు. ఏప్రిల్ 1న కంపెనీలో పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి పనికి వెళ్లకపోవడంతో 2వ తేదీన కంపెనీ నుంచి ఫోన్ చేసి రవీందర్ లేడని తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టు పక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బంగారు గొలుసు చోరీ

తెలకపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పెద్దపల్లికి చెందిన వృద్ధురాలు తూముల వెంకటమ్మ తన కుమారుని కూతు రు శైలజను అదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ఈ నెల 2న చూడడా నికి ఉదయం వెళ్లి మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో వస్తుండగా గ్రామంలోని శ్మశాన వాటిక దగ్గర గుర్తు తెలియని కారులో వచ్చిన వ్యక్తి ఆమె మెడలో ఉన్న తులంపావు బంగారు గొలుసు లాక్కొని పారిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూపల్లిలో మేకల సంత వేలం

చారకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జూపల్లిలో ప్రతీ ఆదివారం జరిగే మేకలు, గొర్రెల సంత 2025-26 సంవత్సరానికి గాను గురువారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సునీత ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. జూపల్లికి చెందిన సూగూరి రామస్వామి రూ. 6,06,326కు వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను, అయిన వాళ్లు చూడక, నిరాదరణకు గురైన పిల్లలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థికంగా అండగా ఉండడం కోసం ప్రతీ నెల రూ.4 వేలు స్పాన్సర్‌షిప్‌ను విద్యార్థులకు అందజేస్తుంది. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామంలో కటికె మల్లాజీ, కటికె సుశీల దంపతులు ఇటీవల మృతి చెందారు. వారి పిల్లలు కటికె రుత్విక్, కటికె రమ్య అనే విద్యార్థులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. మిషన్ వాత్సల్య పథకం గురించి తెలుసుకున్న గ్రామంలోని బీజేపీ నాయకులు ఈ పథకాన్ని పిల్లల పేరుమీద దరఖాస్తు చేశారు. 15 రోజుల్లోనే ఆ విద్యార్థుల బ్యాంక్ ఖాతాలో రూ.24వేలు (మూడు నెలలు) జమ అయ్యాయి. నగదును గురువారం బీజేపీ నాయకులు వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పదిర భీమేష్, దండుగుల మధు, సాతాని శ్రీను, గుండాల శివ, మేకల శివ, బంటుపల్లి శివ, ముచ్చు కృష్ణ, లింగస్వామి, శంకర్, గజ్జి సురేష్, నరేష్, కటిక శివాజీ, కిరణ్, మల్లాజీ పాల్గొన్నారు.

'రేషన్‌షాపుల ముందు ప్రధాని మోదీ ఫొటో పెట్టాలి'

కల్వకుర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపుల ముందు ప్రధాని నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని 9వరేషన్‌షాపులో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేందర్‌గౌడ్, వివేకానంద, బోడ నరసింహ, గంగాధర్, నరేష్‌చారి, శ్రీకాంత్, పర్వతాలు, శివ, అరవింద్‌రెడ్డి, కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా భద్రకాళి సమేత వీరభద్రుడి కల్యాణోత్సవం

బిజినేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలం నాటి వీరభద్రుడి ఆలయంలోని భద్రకాళి సమేత వీరభద్రుడి ఉత్సవమూర్తులకు గురువారం కల్యాణోత్సవం కూచకుళ్ల విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వ హించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రీ తెలిపారు. మండలంలోని నందివడ్డెమాన్‌లోని వీరభద్రుడి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పూజారులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, భక్తులు వీరశేఖర్, చంద్రయ్య, రాజన్న శంకర్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.



నంది వడ్డెమాన్‌లోని వీరభద్రుడి ఆలయంలో భక్తుల పూజలు

దైవత్వంతోనే సన్మార్గం వైపు సమాజం

పదర : ప్రతీ ఒక్కరిలో దైవ చింతనతోనే సమాజం సన్మార్గం వైపు పయనిస్తోందని వికాస తరంగిణి ప్రతినిధులు పాపిశెట్టి అశోక్ అన్నారు. ఆయన గురువారం మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో నిర్వహించిన సుదర్శన హోమం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సుదర్శన హోమానికి ధరూరి రఘునాథచార్యుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామలింగయ్యయాదవ్, చంద్రయ్య యాదవ్, ముత్యాల్‌యాదవ్, హాలరాజు, పురోహితులు శివప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

- డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరామ్ ఆర్య

కందనూలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బాల బాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరామ్ ఆర్య అన్నారు.హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెక్రటరీ ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం గురించి మంతటి జడ్పీ హెచ్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల బాలికలందరూ ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బాని స కాకుండా వాటికి దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పోక్సో చట్టం అడ్డుకట్ట వేస్తుందని అమ్మాయిలు అందరూ తమకు ఏ విధమైన సమస్యలు ఉన్న షీటీంకు గాని, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరు 1098కు గాని సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, పారాలీగల్ వలంటీర్ బాలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామ్ ఆర్య

లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ

కొల్లాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకాన్ని గురువారం కొల్లాపూర్ పట్టణంలోని పలు వార్డులలో ఉన్న రేషన్ షాపుల్లో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు 16వవార్డు మాజీ కౌన్సిలర్ నరసింహారావు ప్రారంభించారు. కొల్లాపూర్‌లో గురువారం రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని 6, 5, 17, 18వ వార్డుల్లో రేషన్ షాపుల్లో ప్రారంభించినట్లు తెలిపారు. కొల్లాపూర్ మునిసిపల్ పరిధిలోని నాలుగు రేషన్ షాపులలో లబ్ధిదారులకు రేషన్ షాపు నిర్వాహకులు సన్న బియ్యం పంపిణీ చేశారు. సామాన్యులకు కూడా కడుపునిండా అన్నం తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూదా బేగం ఖాదర్ పాషా, మాజీ కౌన్సిలర్లు, బరిగెల రాముడు యాదవ్, కర్ని అలివేల వాసు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుర్గయ్య, స్వామి, రామదాసు వనజారెడ్డి, సంధ్య, చంద్రు, మేది నవాజ్, వార్డు నాయకులు , రేషన్ డీలర్లు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంబేడ్కర్ జయంత్యుత్సవాల కరపత్రాలు విడుదల

అచ్చంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలో నిర్వహించతలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సీబీఎం ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ అనురాధ కోరారు. ఈ మేరకు ఆమె గురువారం కార్యక్రమం ప్రచార కరపత్రాలను ప్రారంభించారు. ఉత్సవాలను నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

కోడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం గొల్ల కుందేళ్ల తిరుపతయ్య ఇంటిపై పిడుగు పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నదని గ్రామస్థులు, గ్రామ మాజీ సర్పంచు కొమ్ము సత్యనారాయణ తెలిపారు. చినుకులు పడడంతో పాటు పిడుగు పడగా ఇల్లు రెండు మూడు చోట్ల పాక్షికంగా దెబ్బతిన్నదని, అక్కడక్కడా నెర్రెలు వచ్చాయని గ్రామస్థులు తెలిపారు. ఈ పిడుగు పాటుకు ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అన్నారు.

ఫూలే విగ్రహావిష్కరణకు నీలం మధుకు ఆహ్వానం

బిజినేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఈనెల 9న మహాత్మ జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకల్లో భాగంగా ఫూలే విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని నీలం మధు ముదిరాజ్‌ను బీసీ సంఘం నాయకులు ఆహ్వానించినట్లు తెలిపారు. గురువారం పటాన్ చెరువులో నీలం మధు ముదిరాజ్‌ను ఆయన స్వగృహంలో కలిసి ఫూలే విగ్రహావిష్కరణకు ఆహ్వానించి శాలువాతో ఘనంగా సన్మానించినట్లు దళిత బహుజన సంఘాల నాయకుడు మంగి విజయ్, విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు అంతటి రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఆహ్వానించిన వారిలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంత్ గౌడ్, శాలివాహన సంఘం జిల్లా నాయకుడు ఊర్కొండ రఘు బాబు, మత్స్యకార సహకార సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల అల్లోజీ, బీసీ సంఘం సభ్యులు శ్రీనివాసులు, శంకర్ గౌడ్, గంగమోని శివ, సిద్ధుల శివ తదితరులు ఉన్నారు.



నీలం మధు ముదిరాజ్‌ను ఫూలే విగ్రహావిష్కరణకు ఆహ్వానిస్తున్న బీసీ సంఘం నాయకులు

భక్తులకు ఇబ్బందులు తలెత్తవద్దు

ఊర్కొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆలయం కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామివారి ఆలయం పరిసరాల్లోని గుట్టవైపు కంచె ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారంలో జరిగిన సంఘటన తీవ్రంగా కలచివేసిందని, అందులో భాగంగానే ఆలయం పరిసరాలు చుట్టుపక్కల 10 ఫీట్ల కడిలతో కూడిన కంచె ఏర్పాటు చేసి చుట్టు జాలీ చుట్టి ఈన్-అవుట్ గేట్లు పెడుతు న్నట్లు తెలిపారు. భక్తుల క్షేమమే తమకు కావాల్సిందని, వారికి కావాల్సిన సౌకర్యాలు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆలయం అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి సిబ్బంది మారుతిరావు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో కంచె ఏర్పాటు పనులు ప్రారంభించిన కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి